# అర్థాలే వేరులే

"ఇటువంటి ఉత్తరాలు నీకు రావటం నాకిష్టం లేదు" అన్నాను. ఇంచుమించుగా ఆ ఇన్‌లాండు కవరును నలిపి బల్లపై గిరాటువేస్తూ.

"ఎటువంటి ఉత్తరాలేమిటి?" అంది స్వప్న కొద్దిగా భ్రుకుటి ముడివేస్తూ.

"కాకపోతే ఏమిటీ ఉత్తరం? ఇదేనా ఉత్తరం వ్రాసే తీరు?"

"ఏ తీరులో ఉందేమిటి?"

"ఎన్ని చదువులు చదివితేనేం. సంస్కారం లేకపోయాక."

"అతని సంస్కారాని కేమొచ్చిందిప్పుడు?"

"అసలు నీవీ ఉత్తరం చదివావా అని?"

"మీ ముందరేగా చదివింది? నేను చదువుతున్నప్పుడేగా ఎక్కడి నుంచి ఉత్తరం అని మీరడిగింది?"

"అదే అడుగుతున్నాను. తొందరలో పూర్తిగా చదివావా అని."

"చదవటానికేముంది? గోపాలం అమెరికా నుండి వచ్చాడు. మా ఊరు వెళ్ళాడు. తిరిగి అమెరికాకు పోతున్నాడు. వీలయితే పాలం ఏర్ పోర్టులో కలుసుకోమన్నాడు."

"అంతేనా?"

"ఇంకేముంది?" నన్ను చూచి చాలరోజులయిందన్నాడు. కాస్సేపు నాతో గడపాలనుందన్నాడు."

"అంతేనా?"

"ఏమిటి మీ చాదస్తం. అంతగాక ఇంకేముంది దానిలో" చర్రున లేచి కుర్చీ బర్రున జరిపి కాళీ టీ కప్పులు సింక్ వద్దకు పట్టుకు పోయింది స్వప్న.

నాకు ఒళ్ళు మండిపోతోంది. నాది చాదస్తమట. గోపాలం వ్రాసిన ఉత్తరం చదివి కూడా తను ఇంత కూల్‌గా ఉందంటే నా కాళ్ళ

ర్యంగాఉంది. లేక నన్ను ఫూల్‌ను చేస్తోందా? ఆ ఉత్తరం చదవగానే ఆమె ముఖం వికసించింది. "ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు. ఏడేండ్లయింది గోపాలాన్ని చూచి. ఇప్పుడు ఎంత మారిపోయి ఉంటాడో" అంది. "గోపాలమెవరు?" అన్నాను. "నా బాల్యమిత్రుడండీ. ఒకసారి మీతో చెప్పాను కూడాను అతను అమెరికాలో ఉంటున్నట్టు" అంది. అవును. మా కబుర్లలో రాని విషయాలేవి లేవు. కాని కబుర్లలోని వ్యక్తి ఈ విధంగా సాకారంగా ఉత్తరం వ్రాసి తనను పొలంలో కలుసుకోమనటం. ఈమెగారు సంతోషించటం.... అందులో ఆ ఉత్తరం వ్రాసిన తీరు ఎంత పొగరుమోతుగా ఉంది! నేను కాబట్టి ఊరుకొన్నాను. ఇంకొకరయితే గోపాలాన్ని పొలంకు వెళ్ళి చితకతన్ని ఉండేవాళ్ళు, పెళ్ళయి చక్కగా కాపురం చేసుకొంటున్న పిల్లకు ఇటువంటి ఉత్తరమా వ్రాయవలసింది?

స్వప్న కప్పులు వంటింట్లో పెట్టి తిరిగి వచ్చింది "ఏమిటి ఇంకా అలా కూర్చున్నారు. ఈ రోజైనా వంటలో సాయపడేదుందా లేదా? ఆఫీసులో పనెక్కువయిందేమిటి? వంటయిన తర్వాత అలా తిరిగొద్దాం సరేనా? ఏం కూర చెయ్యను? కాలిఫ్లవరుంటే మీ కింకేమీ అక్కర్లేదు కదూ. పోనీలే కూరగాయల అన్నం చేసేస్తాను. అదయితే కూరతో పని లేదు. బటాణీకాయలు తెస్తాను. కబుర్లు చెబుతూ ఒలుచుకోవచ్చు" అంటూ లోపలికి పోయింది. ప్లాస్టిక్ బుట్టలో మటర్, గోబీ, క్యారెటు పట్టు కొచ్చింది.

"మీరు ఈ కాయలు ఒలిచేయండి. ఇంతలో క్యారెటు తరుగుతాను. అలసటగా ఉంటే వెళ్ళి పడుకోండి నేనే ఒలుచుకొంటాను. కొంచెం రేడియో పెట్టరూ ప్లీజ్. వివిధ భారతిలో తెలుగు పాటలు వచ్చే వేళ యింది."

నేను యాంత్రికంగా వెళ్ళి రేడియో ఆన్ చేసి వచ్చాను. మటర్ ఒలచటానికి కూర్చున్నాను, స్వప్న ఏదేదో మాట్లాడుతోంది. తన ఆఫీసు కబుర్లు చెబుతోంది. తన కొలీగ్ జైన్‌కు కొడుకు పుట్టాడట. ఈ ఆది వారం పార్టీ అట. నన్ను కూడ తప్పక తీసికొని రమ్మన్నాడట. నేనేమీ మాట్లాడగ పోవటం చూచి తన కబుర్లాపేసింది.

"ఏమిటంత మౌనంగా ఉన్నారు. ఏదో ఆలోచిస్తున్నారు నాకు చెప్పటంలేదు. ఇదిగో ఇన్ని కాయలు వొలిచారు. ఒక గింజయినా కన బడదే. మీతో పెట్టుకొంటే ఈ రోజు ఈ వంట అయినట్లే."

తియ్యని బటాణీ గింజలు నములుతున్న నా నోరు ఠక్కున మూత బడింది. అక్కడినుండి లేచి వెళ్ళిపోయాను. పక్కమీద పడుకున్న నా బుర్రలో ఆలోచనలు తేనెటీగల్లా తిరుగుతున్నాయి. వంటింట్లో స్వప్న తిరగమోత పెట్టటం తెలుస్తూనే ఉంది. కమ్మని ఘుమాళింపు నా నోరూ రిస్తుంది. కాస్సేపటికి స్వప్న వచ్చి మంచంపై కూర్చుంది.

"తల నొప్పిగా ఉందా" అంది జుట్టులోకి వేళ్ళు పోనిస్తూ.

లేదని తల ఊపాను.

"ఇంకో పదిహేను నిమిషాల్లో నా పని పూర్తవుతుంది. తర్వాత బయటకు వెళ్దాం. మీరు కూడా లేచి మొహం కడుక్కోండి."

* * *

ఇంకా చీకటి పడలేదు. మార్చి నెల వచ్చిందేమో చలికూడ తగ్గింది. మా ఇంటి దగ్గరే ఉన్న చిన్న పార్కుదాకా నడిచివెళ్ళాం. పచ్చికలో కూర్చున్నాం. చుట్టూ రంగురంగుల పూలు వసంతకన్య అలంకరించుకొన్నట్లున్నాయి. ఎదురుగా నీళ్ళు వదలని ఫౌంటెన్. పైన నీలాకాశం. చుట్టూ పచ్చదనం. నవ్వుతున్న పూలబాలలు చాలా శృంగా రాత్మకమైన వాతావరణం. కాని మనసే చికాకుగా ఉంది.

గోపాలం విషయం తిరిగి స్వప్నే మొదలుబెట్టింది. "మావి ప్రక్క ప్రక్క ఇండ్లే. ఒక బడిలో, ఒకే కాలేజిలో చదువుకొన్నాం. ఆ రోజుల్లో ఎన్ని కబుర్లో.... ఎన్ని జోకులో.... ప్రతిదీ జోక్‌గా చేసి మాట్లాడుతాడు. నా నవ్వుకు పట్టపగ్గాలుండేవికావు. తను బి. యస్. సి. కాగానే బెంగుళూరు వెళ్ళాడు. ఆ తర్వాత ఫారిన్. అక్కడే ఉద్యోగం దొరికింది కూడా. ప్రతి ఏడూ విధిగా గ్రీటింగ్సు పంపుతాడు. ఉత్తర ప్రత్యుత్తరాలు తక్కువ. భలే ఫ్యాషనబులుగా ఉంటాడులే. ఆ రోజుల్లోనే సిటీ లైఫంటే మోజుపడే వాడు. ఇప్పుడు ఇంకెంత స్టైలుగా ఉంటాడో.

మొన్న ఇంటికి వెళ్ళినప్పుడే తెలిసుంటుంది. అతనికి నా పెళ్ళిగురించి. ఇంటి దగ్గర అడ్రసు తీసుకొని ఉత్తరం వ్రాశాడు."

"ఘనకార్యం చేశాడు" అన్నాను.

స్వప్న నా మొహంలోకి తదేకంగా చూచింది.

"ఎందుకు మీ కంత కోపం?" అంది.

నేను మాట్లాడలేదు.

'అయితే ఎల్లుండి గోపాలాన్ని కలుసుకోటం ఉత్తదే అన్నమాట. నన్ను పాలం తీసుకెళ్ళేలాలేరు.'

'నీకు వెళ్ళాలని ఉందన్న మాట. అర్ధరాత్రి ఇరువై కిలోమీటర్లు వెళ్ళి ఆ వి. ఐ. పి.ని కలుసుకోక పోతేనేం? అంత మేనర్‌లెస్ ఫెలో గాలికూడ నీకు తగలటానికి వీల్లేదు."

"నిజంగా మీ ధోరణి నాకర్ధం కావటం లేదు. 'డియర్ స్వప్నా' అని వ్రాశాడనేనా మీరు మండిపడుతున్నారు? నన్నెప్పుడూ పేరుపెట్టే పిలిచేవాడు. ఉత్తరాలింక ఎలా వ్రాస్తాడు?"

"ఈ వాదోపవాదా లెందుకు? అతనిని కలుసుకోవటానికి వీల్లే దంటున్నాను. ఆపైన నీ ఇష్టం."

"సరయిన కారణం లేకుండా మీరు పెట్టే నిషేధం నేను ఒప్పుకోను. నిజం చెప్పండి. వాటీజ్ బగ్గింగ్ యూ? ఒక అబ్బాయి నాకు ఉత్తరం వ్రాశాడని, ఇంకో అమ్మాయి మీతో మాట్లాడిందని అనుమానించే కుసంస్కారం మనకు లేదు. ఇద్దరం ఉద్యోగాలు చేస్తున్నవాళ్ళమే. మీ లేడీ కొలీగ్సు, నా మెన్ కొలీగ్సు మనకు కామన్ ఫ్రెండ్సయ్యారు. గోపాలం విషయంలో ఈ వింతధోరణి ఏమిటి చెప్పండి. దీనిలో రొమాన్సేమీ లేదు కూడాను."

"అతగాడు ఉత్తరం వ్రాసినతీరు నచ్చలేదు స్వప్నా. ఎంత విదేశాలు తిరిగొస్తే మాత్రం తను పుట్టిన దేశమే మరచిపోయినట్లు, ఆచార వ్యవహారాలు తెలీనట్లు....".

"ఏం వ్రాశాడు? 'డియర్ స్వప్నా' అనా?"

"మరీ అంత తక్కువగా అంచనావేయకు నన్ను. ఈ నాగరిక ప్రపంచంలో ఉత్తరాలు వ్రాస్తున్నతీరు నాకు తెలియకపోలేదు. కాని ఇతనేం వ్రాశాడో తెలుసా? ఎల్లుండి అతనికి నీతో డేట్ కావాలట!"

"ఏమిటీ?!"

"యస్. మే ఐ హావ్ ఎ డేట్ విత్ యూ" అని వ్రాశాడు" అని పళ్ళు బిగించి చెప్పాను.

వీధి దీపాలు వెలిగాయి. ఆ వెలుగులో స్వప్న మొహం స్పష్టంగా కనిపించింది. తను నవ్వుతోంది.

"ఎందుకా నవ్వు?"

తనేం మాట్లాడలేదు. మడతపెట్టిన శాలువా విప్పితీసి భుజాలమీద కప్పుకొంది.

"మాట్లాడవేం. ఎందుకు నవ్వుతున్నట్లు?"

"మీ కోపం చూస్తే నవ్వురాదూ. కాస్త అమెరికన్ స్లాంగ్‌లో వ్రాశాడు. అంతమాత్రానికే మండిపడితే ఎలా?"

"అమెరికన్ స్లాంగ్ ఏమిటి నా మొహం. ఇతను అమెరికాలోనే పుట్టి పెరిగాడా?"

"లేదనుకోండి. కాని కొన్నేళ్ళు అక్కడుంటే, అందులో గోపాలంలాంటి వాళ్ళు వారు వీరుగా మారితే ఆశ్చర్యమేముంది? రండి. రండి. ఇక ఇంటికి వెళ్దాం."

ఇల్లు చేరే వరకు ఏవో అర్థంలేని మాటలు సంగతీ సందర్భం లేకుండా మాట్లాడుకొన్నాం. అన్నాల వేళకు వేడివేడిగా అన్నం వడ్డించింది స్వప్న.

"మీ తలనొప్పి తగ్గినట్టేనా?" అంది నవ్వుతూ.

"నాకేం తలనొప్పిలేదు" అన్నాను కొంచెం కటువుగా. భోజనాల టైంలో ఇంకేం మాటలు సాగలేదు.

ఆ తర్వాత నేనేదో పుస్తకం చదువుకొంటుంటే స్వప్న నా చేతిలోని పుస్తకం తీసి అవతల పెట్టింది. 'డేట్' అనే మాటకు అంత ఉడుక్కోవటమెందుకు?" అంది.

"స్వప్నా! ఏమీ తెలీనట్లు మాట్లాడకు. కాలేజి చదువులు చదివిన ఆడపిల్లకు 'డేట్' ఏ అర్థంలో వాడుతారో తెలీకపోదు. మీ హాస్టల్సులో ఎప్పుడూ ఈ విషయమై ఎవరూ జోక్ చేసుకోగా వినలేదా?"

"ఆడపిల్ల తన బాయ్ ఫ్రెండుతో వెళ్ళటాన్ని 'డేట్' అంటారనేగా మీ ఉద్దేశం?"

"అవును. అదిగాక ఇంకేమైనా పవిత్రమైన అర్థం ఉందేమిటి?"

స్వప్న నవ్వు తళుక్కున మెరిసింది. రెప్పపాటు కాలంలో ఛాంబర్స్ డిక్షనరీ నా కళ్ళముందు తెరిచింది. డేట్ అనే పదంవద్ద వేలుపెట్టి చూపించింది. నవ్వుతున్న తన కళ్ళలోకి చూడలేకపోయాను.

"అమెరికన్ స్లాంగ్‌తో నాకేం పని" అంటూ డిక్షనరీ మూసేశాను.

"ఇప్పుడయినా గోపాలాన్ని కలుసుకోటానికి పాలమ్ విమానాశ్రయానికి తీసుకెళ్తారా?"

"ఈ విషయాలేవీ అతనితో చెప్పకేం" అన్నాను. గలగలా నవ్వింది స్వప్న.